ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

నంద్యాల

జిల్లా వార్తలు

5


మంగళవారం 4 ఫిబ్రవరి 2025



ఆదిదేవ.. నమస్తుభ్యం..!

- నల్లమలలో శిథిలావస్థలో సూర్య ఆలయం
- క్రీ.శ. 1080 కంటే ముందే నిర్మాణం
- కర్నూలు నగరంలో అద్భుత శైలిలో ఆలయం
- నేడు రథసప్తమి





ముల్లోకాల్లో ఉన్న దేవుళ్లలో మన కంటితో చూడగలిగేది సూర్యుడిని మాత్రమే. అందుకే సూర్యుడిని ప్రత్యక్ష దైవమని పిలుస్తారు. రథసప్తమి రోజు ప్రత్యేకంగా సూర్య ఆరాధన చేస్తారు. ప్రతి ఏటా మాఘమాసంలో శుద్ధ సప్తమిని రథసప్తమిగా నిర్వహించుకుంటాం. ఇదే రోజున సూర్య భగవానుడు జన్మించాడని అంటారు. సూర్య భగవానుడు మనకు ఆరోగ్యాన్ని ప్రసాదించే దేవుడు. భూమిపై ఉన్న జీవరాశులను కాపాడే దేవుడు సూర్యుడు. సూర్యుడే ఎండను ఇవ్వకపోతే పంటలు పండక ఎన్నో రకాల ఆరోగ్య సమస్యల బారిన పడి జీవరాశి అంతరించిపోయేది. అందుకే సూర్యుడిని దైవంగా పూజిస్తాము. సూర్య భగవానుడు దక్షిణాయణం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశించే సమయంలో రెండు పర్వదినాలు ఘనంగా జరుపుకొంటారు. అందులో మొదటిది మకర సంక్రాంతి కాగా, రెండోది రథసప్తమి.

-ఆత్మకూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి)

శిథిల గర్భంలోకి ఆదిత్యుడి ఆలయం..!

ఆత్మకూరు మండలం నల్లమల అడవుల సమీపంలో ఓ గ్రామం పెద్దఅనంతసంపద పట్టణంగా విరాజిల్లింది. కాలక్రమేణా.. ఆ గ్రామంలో ఆనాటి ఆనవాళ్లని తుడిచిపెట్టుకుపోయి. ప్రస్తుతం పెద్దఅనంతాపురం గ్రామంగా పేరొందింది. ఈ గ్రామానికి తూర్పుదిశన ప్రాచీన త్రికోణ గోపుర ఆధిత్యాలయం వందల సంవత్సరాల క్రితం నిర్మించబడింది. క్రీ.శ 1080 క్రితమే ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ఇక్కడి చారిత్మక వివరాలను బట్టి తెలుస్తోంది. కాగా 1880 సంవత్సరంలో ఈ ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. ఏక ఉపరితలంగా మిగిలిన ఈ ఆలయంలోని గర్భాలయంలో ప్రస్తుతం ఎలాంటి ఆనవాళ్లు లేకుండా పోయాయి. చుట్టూ కేవలం రాతి కట్టడంతో పాటు ఇటుకలతో కూడిన విమాన గోపురం నిర్మాణం నేటికి చరిత్ర సాక్ష్యాలుగా మిగిలి ఉన్నాయి. అప్పట్లో ఓ సామంతరాజు ఈ ఆలయాన్ని పర్యవేక్షించేవారని తెలుస్తోంది.

కర్నూలు నగరంలో సూర్య దేవాలయం

కర్నూలు నగరంలో గుత్తిరోడ్డు సమీపంలో సూర్యనారాయణ స్వామి ఆలయ నిర్మాణం ఆకట్టుకుంటోంది. రాయలసీమలోనే మొదటిదిగా, రాష్ట్రంలో ఆరసవెల్లి తర్వాత రెండోదిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయం నిత్య పూజాది కార్యక్రమాలతో విరాజిల్లుతూ ఉంటుంది. మైసూరు దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ క్షేత్రం రోజురోజుకూ పెరుగుతున్న భక్తులతో నిత్యకల్యాణం పచ్చతోరణంగా శోభిల్లుతోంది. 2019 ఫిబ్రవరి నెలలో వసంత పంచమి రోజున గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆలయాన్ని ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఈ ఆలయంలో నిత్య పూజలు, హోమాలు జరుగుతూనే ఉన్నాయి.



పెద్దఅనంతపురం గ్రామ సమీపంలో శిథిలమైన శతాబ్దాల కాలం నాటి సూర్య దేవాలయం

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి



ఇంటర్ పరీక్షలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రాజకుమారి

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 03 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఇంటర్ పరీక్షల నిర్వహణపై సబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మార్చి 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లుగా డిప్యూటీ తహసీల్దార్లను కేటాయించాలని డీఆర్వోను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వోను ఆదేశించారు. సంబంధిత పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మొదటి సంవత్సరం 14,272 మంది జనరల్ విద్యార్థులు, 1418 మంది ఒకేషనల్ విద్యార్థులు కలిపి మొత్తం 15,692 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే రెండో సంవత్సరం 12,271 జనరల్ విద్యార్థులు, 1129 మంది ఒకేషనల్ విద్యార్థులు కలిపి మొత్తం 13,400 మంది విద్యార్థులు హాజరవుతున్నారని ఎలాంటి ఇబ్బందులు లేకుండా లైటింగ్, తాగునీటి సరఫరా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరుగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని అన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ మిషన్లు మూసి వేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, డీఐఈఓ సునీత, ఇంటర్ పరీక్షల నిర్వహణ స్పెషల్ ఆఫీసర్ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులు నాణ్యతతో పరిష్కరించండి

ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో 198 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

నులిపురుగుల నివారణ మాత్రలను మింగించండి

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. నులిపురుగు నివారణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల దినాన్ని పురస్కరించికొని 1-19 సంవత్సరాల లోపు విద్యార్థులదరికీ నులిపురుగుల నివారణ మాత్రలు మింగించాలని ఆదేశించారు. నంతరం నులిపురుగుల నివారణపై ముద్రించిన గోడపత్రికలను జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఎంఅండ్‌హెచ్ఓ డా.వెంకటరమణ, జిల్లా ప్రోగ్రాం అధికారి డా. కాంతారావు నాయక్ విడుదల చేశారు.



ఎరువు దోపిడీ..!

- ఒక్కో బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు
- యూరియా కావాలంటే ఇంకో రకం కొనాల్సిందే..!
- షరతులు పెడుతున్న ఫర్టిలైజర్స్ షాపుల యజమానులు
- తప్పక కొని నష్టపోతున్న రైతులు

నంద్యాల, ఫిబ్రవరి 3, (ఆంధ్రజ్యోతి) : ఫర్టిలైజర్స్ షాపుల యజమానులు రైతులు నిలువు దోపిడీ చేస్తున్నారు. ఒక్కో బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తూ అన్నదాతలను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సర్వ సాధారణంగా రబీ సీజన్ రాగానే యూరియాకు డిమాండ్ పెరుగుతుంది. ఇదే అదునుగా భావించి కొందరు ఎరువుల దుకాణాదారులు కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. ఇందులో యూరియా కావాలంటే మరో రకం ఎరువు కొనాల్సిందే అని షరతు పెడుతున్నారు. నంద్యాల జిల్లా కేంద్రంతో పాటు ఆళ్లగడ్డ, బనగానపల్లి, ఆత్మకూరు, నందికొట్కూరు, కోయిలకుంట్ల, డోన్, మహానంది ప్రాంతాల్లో ఈ తరహా దోపిడీ ఎక్కువగా జరుగుతోందని సమాచారం. ఒక యూరియా బస్తాను రూ.266 చొప్పున విక్రయించాల్సి ఉండగా రూ.320, రూ.360 అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దీనికితోడు చాలా వరకు దుకాణాల వద్ద ఎలాంటి ఎరువుల వివరాలు, ధరల పట్టికలను సైతం ప్రదర్శించడం లేదు. తనిఖీలు చేయాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. కొందరైతే వారిచ్చే ఆమ్యామ్యాలతో సరిపెట్టుకుంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎరువులను కలుపుతున్న రైతులు



యూరియాతో పాటు మరొకటి కొనాల్సిందే



యూరియా కావాలని అడిగితే, డీఏపీ కానీ.. నీళ్ల మందుకానీ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదికూడా యూరియా బస్తా రూ.330, రూ.350 చెప్తున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో పంట కోసం అధిక ధర చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. నాలాగే చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలి.

- రైతు వెంకటరమణ, మహానంది మండలం

అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తాం..

జిల్లాలో ఎవరైనా వ్యాపారులు ఎరువులను ఎక్కువ ధరలకు విక్రయించినా.. ఒక దానికి ఒకటి లింకు పెట్టినా సదరు వ్యాపారి లైసెన్సు రద్దు చేస్తాం. రైతులు కూడా సమస్యను మా దృష్టికి తీసుకువస్తే పరిశీలించి సదరు వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. రైతులకు న్యాయం జరిగే విధంగా ఆయా ప్రాంతాల అధికారులను అప్రమత్తం చేస్తాం.

- జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్‌తో మంత్రి బీసీ భేటీ



తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డితో భేటీ అయిన రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 3 ఆంధ్రజ్యోతి): తాడిపత్రిలోని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డితో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు నాపరాయి గనుల సమస్యలపై చర్చించారు. తాడిపత్రి, బనగానపల్లె మండలంలో నాపరాయి పరిశ్రమలను రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను వారు వివరించుకున్నారు. నాపరాయి పరిశ్రమలకు విద్యుత్ చార్జీలు తగ్గించేలా కృషి చేయాలని కోరారు. అలాగే నాపరాయి పరిశ్రమ సంక్షోభంలో ఉందని, ఆదుకోవడానికి చేపట్టాల్సిన చర్యలపై మాట్లాడారు. అనంతరం ఆర్‌అండ్‌బీ శాఖాధికారులతో ఇరువురు సమావేశమయ్యారు. అనంతపురం జిల్లాలో గుంతల రహిత రోడ్లే లక్ష్యంగా చేపట్టిన మరమ్మతులు, ఇతర రోడ్ల పనులపై మంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ ఏపీలో గుంతల రహిత రోడ్లే లక్ష్యంగా రూ.1060 కోట్లు ఖర్చు పెట్టి 88 శాతం రోడ్లను గుంతల రహితంగా తీర్చిదిద్దామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. పీపీపీ మోడల్‌లో రాష్ట్రంలో రూ.3 వేల కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గత సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రంలో పరిశ్రమలు తరలిపోవడంతో పాటు పారిశ్రామికాభివృద్ధి కుంటుబడిందని తెలిపారు. నేడు సీఎం చంద్రబాబునాయుడుపై భరోసాతో ఆయా పరిశ్రమలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి భారీ సంఖ్యలో వస్తున్నారన్నారు. చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి ప్రజలు కూటమి ప్రభుత్వానికి 164 సీట్లు ఇచ్చి ప్రజలు పట్టం కట్టారన్నారు. వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలే తిప్పికొడతారన్నారు.

రైల్వే స్టేషన్లకు మహర్దశ

- ఇప్పటికే కర్నూలు సిటీ, ఆదోని స్టేషన్లలో పనులకు శ్రీకారం
- వివిధ దశల్లో నిర్మాణాలు
- మహబూబ్‌నగర్-డోన్ వయా కర్నూలు మధ్య డబ్లింగ్
- ఉమ్మడి జిల్లాకు ఆశాజనకంగా నిధులు వచ్చే అవకాశం
- బడ్జెట్ ముఖ్యాంశాలు వెల్లడించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్



కర్నూలు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ రైల్వే ప్రాజెక్టులకు రూ.9,417 కోట్లు 2025-26 బడ్జెట్‌లో కేటాయింపులు చేశామని రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ సోమవారం వెల్లడించారు. ఏ ప్రాజెక్టుకు ఎంత నిధులు ఇచ్చారో స్పష్టత ఇవ్వలేదు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ఎంపికైన జిల్లాలో కర్నూలు సిటీ, ఆదోని రైల్వే స్టేషన్ల ఆధునికీ కరణకు నిధులు ఇచ్చారు. మహబూబ్ నగర్-డోన్ వయా కర్నూలు రైల్వేలైన్ డబ్లింగ్, విద్యుదీకరణకు కూడా నిధులు కేటాయించినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. కర్నూ లు నగరవాసుల చిరకాల స్వప్నమైన వెంకటరమణ కాలనీ వైపు రెండు ప్రధాన ద్వారం (సెంకెడ్ గేట్), మొదటి ప్రధాన ద్వారం (ఫస్ట్ గేట్) ఆధునికీకరణ పనులు మొదల య్యాయి. తాజా బడ్జెట్‌లో ఆశాజనకంగా నిధులు కేటాయించడంతో పనులు వేగంగా జరుగుతాయని రైల్వే అధికారులు అంటున్నారు.

మిగతా 6వ పేజీలో

బాధితులకు న్యాయం చేస్తాం

పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి చట్టపరిధిలో న్యాయం చేస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. సోమవారం నంద్యాలలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు వచ్చి ఎస్పీకి వినతులు సమర్పించారు. పలు సమస్యలపై 95మంది ఫిర్యాదుదారులు అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్టపరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని అధికారులకు సూచించారు. సివిల్ తగాదాలు, కుటుంబకలహాలు, అత్తారింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు తదితరాలున్నాయని ఎస్పీ పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి రాలేనివారు ప్రతి సోమవారం సమీప పోలీస్ స్టేషన్, సర్కిల్ ఆఫీస్, డీఎస్పీ కార్యాలయాల్లో జరిగే పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీపీవో మంద జావళి ఆల్ఫోన్స్ పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

విశ్వవిజేత స్థాయికి పేపర్ బాయ్

- సెపక్‌తక్రా క్రీడతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం
- శివకుమార్ విజయ ప్రస్థానం స్ఫూర్తిదాయకం

6

యువ

విశ్వవిజేత స్థాయికి పేపర్ బాయ్

- తల్లి చదివించింది.. కొడుకు సాధించాడు
- సెపక్‌తక్రా క్రీడతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం
- శివకుమార్ విజయ ప్రస్థానం స్ఫూర్తిదాయకం



థాయ్‌లాండ్‌లో జరిగిన పోటీలో పాల్గొన్న శివ (ఫైల్)

నంద్యాల వైద్యం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తండ్రి చిన్న తనంలోనే చనిపోయాడు.. ముగ్గురు కుమారులను కష్టపడి పోషించింది. ఆమె కష్టాన్ని కుమారులు వృథా పోనివ్వలేదు. సెపక్‌తక్రా క్రీడనే నమ్ముకున్న ఆ కుటుంబం వారి జీవనోపాధికి బాటలు వేసింది. పేపర్ బాయ్ నుంచి ప్రపంచ కప్ దాకా ఎదిగిన ఆ అంతర్జాతీయ క్రీడాకారుడి విజయ ప్రస్థానం ఇది. కర్నూలుకు చెందిన సరస్వతి, ఎర్రన్నలకు ముగ్గురు కుమారులు. ఎర్రన్న రుమాల్‌రోటీ తయారు చేయడంలో సిద్ధహస్తుడు. చెఫ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అనివార్య కారణాల వల్ల 2014లో అనారోగ్యం పాలై ఎర్రన్న మృతి చెందడంతో తల్లి సరస్వతిపై కుటుంబ భారం పడింది. కుటుంబం ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్న ముగ్గురు పిల్లలు అశోక్‌కుమార్, శివకుమార్, చిరులు తల్లికి చేదోడువాదోడుగా ఉండేవారు. రెండవ కుమారుడైన శివకుమార్ తండ్రి బాటలో పయనిస్తూ పార్ట్‌టైమ్‌గా ఉదయం పేపర్‌బాయ్‌గా పనిచేస్తూ అనంతరం మైదానంలో సెపక్‌తక్రా క్రీడను సాధన చేసేవాడు. పనులు చేసుకుంటూ ఆట ఆడుతూ బి.కామ్ పూర్తి చేశాడు. చిన్నప్పుడు చేసిన కఠోర సాధన నేడు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి బంగారు పతకాలను తెచ్చిపెడుతోంది. అన్న అశోక్‌కుమార్ కూడా సెపక్‌తక్రా క్రీడలో ప్రతిభ కనబరచి స్పోర్ట్స్ కోటాలో హైదరాబాద్‌లో పోస్టల్ శాఖలో ఉద్యోగం సాధించాడు. తమ్ముడు చిరు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. శివకుమార్ సెపక్‌తక్రాలో దాదాపు 20కిపైగా రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నాడు. అయిదు సార్లు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించాడు. 2024 జూలైలో ముంబైలో ఇన్‌కంట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించాడు. ఈ ఉద్యోగానికి దాదాపు 10వేల మంది క్రీడాకారులు దరఖాస్తు చేసుకోగా అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించడంతో కొలువు శివకుమార్‌ను వరించింది.

అన్న స్ఫూర్తితోనే..

సెపక్‌తక్రా క్రీడలో అన్న అశోక్‌కుమార్ స్ఫూర్తితో, కార్యదర్శి శ్రీనివాసులు ప్రోత్సాహంతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగాను. రెండు సార్లు రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అంతర్జాతీయ పోటీలకు ఆర్థిక సహాయం అందించారు. సెపక్‌తక్రాలో ఓనమాలు నేర్పింది పీఈటీ కిశోర్. ఏషియన్ గేమ్స్‌లో మెడల్ సాధించడమే లక్ష్యం. బీపీడీ, ఎంపీడీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉండగా నోటిఫికేషన్ రావడం.. దరఖాస్తు చేసుకోవడం.. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం రావడం నేను ఊహించలేదు. క్రీడాకారులు కష్టపడి సాధన చేస్తే ఫలితం తప్పకుండా దక్కుతుందనేదానికి నేనే నిదర్శనం.

- సి.శివకుమార్, అంతర్జాతీయ క్రీడాకారుడు

అంతర్జాతీయ పోటీల్లో ఇలా..

- 2022లో సీనియర్ రెగు వరల్డ్ చాంపియన్‌షిప్ బ్యాంకాక్‌లో గోల్డ్‌మెడల్
- 2023లో సీనియర్ క్వాడ్ విభాగంలో బ్యాంకాక్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్ షిప్‌లో బ్రాంజ్‌మెడల్
- 2023లో చైనాలో జరిగిన 19వ ఏషియన్ గేమ్స్‌లో క్వాడ్ విభాగంలో ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం
- 2024లో సౌత్ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో మూడు బంగారు పతకాలు
- 2024లో థాయ్‌లాండ్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం


సౌత్ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకంతో శివ (ఫైల్)

25 నుంచి కాల్వబుగ్గ బ్రహ్మోత్సవాలు


ఉత్సవాల లగ్నపత్రికను ఈవోకి అందజేస్తున్న అర్చకులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మద్దిలేటి తెలిపారు. సోమవారం ఆలయ ప్రధానార్చకులు కల్లె లక్ష్మినారాయణ శర్మ, కల్లె నరసింహశర్మ ఆధ్వర్యంలో మహా శివరాత్రి ముహూర్తాన్ని ఖరారు చేశారు. ఈ నెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు కాల్వబుగ్గలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 25న మంగళవారం బుగ్గ రామేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు కాల్వ గ్రామం నుంచి కాల్వబుగ్గకు ప్రయాణం, 26న బుధవారం అంకురార్పణ, ధ్వజారోహణం, పగలు బుగ్గ రామేశ్వరస్వామి, భ్రమరాంబదేవికి పంచామృతాభిషేకం, రాత్రి స్వాములవారికి గ్రామాభిషేకం, 27వ తేదీ గురువారం తెల్లవారుజామున స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, అదే రోజు నందివాహన సేవ, సాయంత్రం 5 గంటలకు ప్రభోత్సవం, 28న శుక్రవారం సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, మార్చి 1న శనివారం ఉదయం వసంతోత్సవం, సాయంత్రం పారువేట, మార్చి 2వ తేదీ ఆదివారం పంచామృతాభిషేకం బుగ్గరామేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు కాల్వగ్రామానికి తిరుగు ప్రయాణం వేడుకలు ఉంటాయని తెలిపారు. మాజీ చైర్మన్లు చంద్రపెద్దస్వామి, జీకే సుధాకర్, భక్తులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, ఆకుల మహేష్, కేవీ మధు, మహబూబ్ బాషా, బజారు, నాగరాజు, జయకృష్ణ, గువ్వ రవికుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లకు మహర్దశ..!

(5వ పేజీ తరువాయి)

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రాష్ట్రంలో 73 రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి చేపట్టామని రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ వెల్లడించారు. అందులో కర్నూలు సిటీ, ఆదోని కూడా ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ పరిధిలో ముఖ్యమైన రైల్వే స్టేషన్‌లో కర్నూలు ఒకటి. స్వాతంత్ర్యానికి పూర్వమే 1905లో ప్రారంభించారు. 120 ఏళ్ల చరిత్ర కలిగిన స్టేషన్ ఇది. 2013-14లో కర్నూలు సిటీ రైల్వే స్టేషన్‌గా మార్చారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం కింద రూ.42.6 కోట్లు మంజూరు చేశారు. 2023 ఆగస్టులో ప్రధాని మోదీ వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. రైల్వే స్టేషన్ వెనుక వైపు వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్, లేబర్‌కాలనీ, సంతోష్ నగర్, బాలాజీ నగర్, కప్పలనగర్.. వంటి కాలనీలు విస్తరిస్తున్నాయి. నగరం అటువైపు రోజురోజుకు విస్తరిస్తుంది. ఆయా ప్రాంతాలకు చెందిన రైల్వే ప్రయాణికులు స్టేషన్‌కు రావాలంటే అశోక్‌నగర్ వద్ద నున్న రైల్వే లైన్ అండర్ బిడ్జి దిగువ నుంచి లేదంటే ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఐదు రోడ్ల కూడలి మీదుగా రావాలి. వర్షం వస్తే రైల్వే లైన్ అండర్ బిడ్జిలో వర్షపు నీరు నిండిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంకటరమణ కాలనీ వైపు ఓ ద్వారం (సెకండ్ ఎంట్రీ గేట్) ఏర్పాటు చేయాలని ప్రయాణికులు ఎన్నో ఏళ్లుగా విన్నవిస్తున్నారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకంలో భాగంగా సెకండ్ ఎంట్రీ గేట్ ఏర్పాటు చేస్తున్నారు. పునరుద్ధరణ పనుల్లో ఇది ఎంతో కీలకమైనది. ప్రయాణికుల అభిరుచులకు అనుగుణంగా అత్యాధునిక హంగులతో రెండో ద్వారం నిర్మాణం పనులు మొదలు పెట్టారు. అలాగే రెండో ముంబాయిగా ఖ్యాతిగాంచిన ఆదోని రైల్వే స్టేషన్‌కు ఎంతో చరిత్ర ఉంది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపిక చేసి రూ.11.50 కోట్లతో పనులు మొదలు పెట్టారు. తాజాగా బడ్జెట్‌లో నిధులు ఇవ్వడంతో ఈ పనులు మరింత వేగంగా పూర్తి చేయడానికి అవకాశం ఉందని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.



ఆదోని రైల్వే స్టేషన్

మహబూబ్‌నగర్-డోన్ మధ్య డబ్లింగ్‌కు పచ్చజెండా

మహబూబ్‌నగర్ - డోన్ వయా గద్వాల, కర్నూలు, వెల్దుర్తి 197 కి.మీల డబ్లింగ్ రైల్వే లైన్ నిర్మాణం, విద్యుద్దీకరణ చేపట్టాలని ఎన్నో ఏళ్లుగా రైల్వే ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. గతేడాది నవంబరులో రూ.2,208 కోట్లతో చేపట్టే పనులకు ప్రధాని మోదీ విశాఖ కేంద్రంగా వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ మార్గం నిర్మాణం పూర్తయితే రెండు తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు ప్రయోజనకరంగా ఉంటుంది. కర్నూలు, నంద్యాల జిల్లాలో 54 కి.మీలు, తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల పరిధిలో 143 కిలోమీటర్ల డబ్లింగ్ రైలు మార్గం నిర్మించనున్నారు. తాజా బడ్జెట్‌లో అవసరమైన మేరకు నిధులు కేటాయింపులు చేశారని అధికారులు తెలిపారు.

దళారుల చేతుల్లో మోసపోవద్దు: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కందులు కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత సూచించారు. సోమవారం ఓర్వకల్లులోని సహకార పరపతి సం ఘం కార్యాలయంలో కంది కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కందులకు ప్రభుత్వం క్వింటంకు రూ.7,550 మద్దతు ధర కల్పించిందన్నారు. కందుల్లో 12 శాతం కంటే తక్కువగా తేమ ఉండాలన్నారు. అలాగే మండలంలో రైతులు సాగు చేసిన పొగాకు పంటకు కంపెనీలు మద్దతు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, ఎంపీడీవో శ్రీనివాసులు, సర్వే డీటీ షర్మిళ రెడ్డి, నాయకులు గోవిందరెడ్డి, మోహన్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, సుధాకర్‌రావు, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఏవో సుధాకర్, సీఈవో మద్దిలేటి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5 నుంచి 7 వరకు 3 రోజుల పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ తెలిపారు. నగరంలోని బిర్లాగేట్ సమీపంలోని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సంకల్ప్ పథకంలో భాగంగా నిర్వహించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పారిశ్రామికవేత్తలు ఎదగడానికి కావాల్సిన మెలకువలు, వ్యాపారం చేసుకోవడానికి కావాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 96761 41731 సంప్రదించాలని తెలిపారు.

జడ్పీలో కారుణ్య నియామకాలు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో కారుణ్య నియామకం కింద నాల్గవ తరగతి ఉద్యోగులను నియమించారు. ఈ మేరకు సోమవారం జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జి. శ్రీనివాస సాయి నితిన్‌ను కౌతాళం ఎంపీడీఓగా, మస్తాన్ వలిని ఆళ్లగడ్డ ఎంపీడీఓగా, గోపీనాథ్‌ను గూడూరు ఎంపీడీఓగా, డి. పసిఫిక్‌ను పత్తికొండ ఎంపీడీఓగా, పి.డి. ప్రదీప్‌కుమార్‌ను పాములపాడు ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.49 కోట్లతో బైపాస్ రోడ్డు

- 44 ఎకరాల భూ సేకరణ
- 45 మీటర్లు వెడల్పు, 4.5 కిలోమీటర్ల పొడవు
- మంత్రాలయంలో తీరనున్న ట్రాఫిక్ సమస్య


మంత్రాలయంలోని రాఘవేంద్ర సర్కిల్

మంత్రాలయం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే వాహనాల ట్రాఫిక్ సమస్య తీరనుంది. దీని కోసం నేషనల్ హైవే అధికారులు రూ.49 కోట్లతో కల్లుదేవకుంట నుంచి చెట్నహల్లి మీదుగా బైపాస్ రోడ్డును నిర్మించేందుకు టెండర్లు పూర్తి చేశారు. ఏప్రిల్‌లో పనులు ప్రారంభానికి శ్రీకారం చుడుతున్నట్లు హైవే రోడ్డు ఈఈ శంకర్ రెడ్డి తెలిపారు. 45 మీటర్ల వెడల్పుతో 4.5 కిలోమీటర్ల పొడవున రెవెన్యూ అధికారులు అలైన్‌మెంటు పూర్తి చేశారు. ఎమ్మిగనూరు నుంచి వచ్చే 167 జాతీయ రహదారి కల్లుదేవకుంట దాటిన తర్వాత చెట్నహల్లి శివారులో కలిపేందుకు బైపాస్ రోడ్డుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందులో చెట్నహల్లి గ్రామానికి చెందిన 16 మంది రైతుల 6.04 ఎకరాలు, మంత్రాలయం చెందిన 43 మంది రైతులు 16.98 ఎకరాలు, కల్లుదేవకుంట గ్రామానికి చెందిన 14 మంది రైతులకు చెందిన 6.37 ఎకరాలు, శ్రీరాఘవేంద్రస్వామి మఠానికి చెందిన 14.49 ఎకరాల భూములను అలైన్‌మెంట్ పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించారు. ఇందులో చెట్నహల్లి పరిధిలో 75 ప్లాట్లు సైతం బైపాస్ రోడ్డులో కోల్పోనున్నారు. ఈ బైపాస్ రోడ్డు పూర్తయితే మంత్రాలయం మీదుగా వచ్చే భారీ వాహనాలు, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని బెంగుళూరు, తమిళనాడు, చెన్నై తదితర పట్టణాలకు వెళ్లే వాహనాలు బైపాస్ మీదుగా వెళతాయి. దీంతో రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్య తీరుతుంది. ఎల్లప్పుడు మంత్రాలయంలో వాహనాల రద్దీని పోలీసులు కంట్రోల్ చేయలేకపోతున్నారు. రాఘవేంద్రసర్కిల్ ట్రాఫిక్‌తో పద్మవ్యూహంలా తయారైంది. ఈ బైపాస్ రోడ్డు పూర్తయితే మంత్రాలయానికి వాహనాల రద్దీ తగ్గుతుంది. ట్రాఫిక్ సమస్య తీరుతుంది. దీని కోసం భూములు కోల్పోయే రైతులు ఎకరా, అరెకరా పొలాలను, ప్లాట్లను నమ్ముకున్నవారి పరిస్థితి దయనీయంగా మారింది. అలైన్‌మెంట్‌ను మార్చి న్యాయం చేయాలని రైతులు రాఘవేంద్ర స్వామి మఠం అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. కొంత మంది రైతులతో ఆదోన్ సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ రైతులతో చర్చలు జరిపి, రైతులకు రావాల్సిన నష్టపరిహారం త్వరలో ఇప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు.

భూసేకరణ పూర్తి



రూ.49 కోట్లతో కల్లుదేవకుంట నుంచి గోశాల వెనుక భాగం మీదుగా చెట్నహల్లి వరకు 4.5 కిలోమీటర్లు పొడువున నిర్మించబోయే బైపాస్ రోడ్డుకు దాదాపు భూసేకరణ అలైన్‌మెంట్ పూర్తి చేశాం. కొంత మంది రైతులు అలైన్‌మెంటు మార్చాలని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రైతులతో చర్చించి వారికి తగిన నష్టపరిహారాన్ని జిల్లా అధికారులు నిర్ణయిస్తారు. ఇప్పటికే రెండు, మూడు దఫాలుగా రైతులతో సబ్ కలెక్టర్ చర్చలు జరిపారు. ఏప్రిల్‌లో పనులు ప్రారంభించేందుకు హైవే రోడ్డు అథారిటీ సిద్ధమైంది.

-ఎస్.రవి, తహసీల్దార్, మంత్రాలయం

రాఘవేంద్రుడిపై నెలవెంక

మంత్రాలయం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం గర్భగుడి స్వర్ణ శిఖర కలశంపై నెలవంక కనువిందు చేసింది. ఈ అద్భుత, ఆహ్లాదకరమైన దృశ్యం సోమవారం రాత్రి భక్తులను ఆకట్టుకుంది. రాఘవరాయుడి భక్తులు గర్భగుడి స్వర్ణ గోపుర కలశంపై ఉన్న నెలవంకను తిలకించి తరించారు.


రాఘవరాయుడి గర్భగుడి శిఖర కలశంపై నెలవంక

'రామాయణం జాతీయ గ్రంథం'

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రామాయణం ఒక మత గ్రంథం కాదని, అది భారత జాతీయ గ్రంథమని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోగల వీహెచ్‌పీ కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన రామాయణ గ్రంథ పరీక్షల్లో విజేతలైన విద్యార్థులకు, పరీక్షల నిర్వహణకు సహకరించిన పాఠశాలల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు జ్ఞాపి కలు, విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ రామాయణ గ్రంథంలోని పాత్రలన్నీ సామాజిక సామరసతను తెలియజేస్తాయని వివరించారు. రాష్ట్రంలో 108 ప్రైవేటు పాఠశాలల్లో 10వేలకు పైగా విద్యార్థులు రామాయణ గ్రంథంపై నిర్వహించిన పరీక్షలు రాసి అం దరూ ఉత్తీర్ణత సాధించారన్నారు. నగరంలో 15 పాఠశాలల్లో 800 మంది విద్యార్థులు పాల్గొని రాష్ట్రంలోనే రెండో స్థానంలో జిల్లాను నిలిపారని ప్రశంసించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, పరీక్షల రాష్ట్ర, జిల్లా కన్వీనర్లు గూడా సుబ్రహ్మణ్యం, జంపాల రాధిక, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. వాసుదేవయ్య, జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాశ్, సహ కార్యదర్శి ఈపూరి నాగరాజు, కోశాధికారి అయోధ్య శ్రీనివాసరెడ్డి, మహిళా విభాగాల కన్వీనర్లు పావని, ఈపూరి లక్ష్మి పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి

ఉరుకుందలో ముగిసిన మహాకుంభాభిషేకం

కౌతాళం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గోపురాలపై మహా కుంభాభిషేకం, కలశాల ప్రతిష్టాపన ఉత్సవాలు మూడో రోజు సోమవారంతో ఘనంగ ముగిశాయి. చివరి రోజు దేవాలయంలో గణపతి పూజ, గవ్యాంతమార్జనలు, పీఠ పూజ, నవరత్నాన్యాసం, విగ్రహ రలశ, ధ్వజ శిఖర ప్రతిష్ఠ వంటి కార్యక్రమాలను అల్లవరపు సుబ్రహ్మణ్యదీక్షితావధాని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు స్వామి వారి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కలాశాల ప్రతిష్టాపనలో పాల్గొన్న వివిధ మఠాల పీఠాధిపతులు దేవాలయంలో సుమారు రూ.8 కోట్లతో నిర్మించిన నాలుగు గోపురాలతో పాటు రాజగోపురానికి ప్రతిష్ఠించిన 32 బంగారు కలశాల ప్రతిష్టాపనకు పుష్పగిరి మఠం పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్య విద్యానృసింహ భారతీస్వామి, మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు, హల్వి మఠం పీఠాధిపతి మహంతేష్ స్వామి హాజరై కుంభాలతో గోపురాలపై కలశ ప్రతిష్టాపన చేపట్టారు. అంతకు ముందు యాగశాలలో కలశాలకు ప్రత్యేక హోమాలను నిర్వహించి ప్రతిష్టాపన చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా ఉరుకుంద గ్రామస్థులు మహిళలకు కలశాలతో ఊరేగింపుగా గ్రామ చావిడి నుంచి బయలుదేరి స్వామి వారి సన్నిధిలో స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.


అలంకరణలో ఉరుకుంద ఈరన్న స్వామి


ఉరుకుంద క్షేత్రంలో భక్తుల రద్దీ



కబళిస్తున్న క్యాన్సర్

- పెను ప్రమాదంలో ఆరోగ్యం
- నేడు వరల్డ్ క్యాన్సర్ డే

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమైన వ్యాధి. శరీరంలో ఏ భాగంలోనైనా క్యాన్సర్ రావచ్చు. శరీరంలో కణాలు అదుపు లేకుండా పెరిగినప్పుడు క్యాన్సర్ వస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న మరణాలకు రెండో ప్రధాన కారణం క్యాన్సర్. మగవారిలో ఊపిరితిత్తులు, ప్రొస్టేట్, కొలోరస్ట్రాల్, కడుపు, లివర్ క్యాన్సర్లు ఎక్కువగా వస్తాయి. మహిళల్లో బ్రెస్ట్, కొలోరెక్టాల్ ఊపిరితిత్తులు, గర్భాశయ, థైరాయిడ్ క్యాన్సర్లు కనిపిస్తాయి. దేశంలో 40 లక్షల మంది క్యాన్సర్ బాధితులు మృతి చెందుతున్నారు. మంచి వైద్యం దొరికితే, ధైర్యంగా ఎదుర్కొంటే క్యాన్సర్ నుంచి బైటపడవచ్చు. నేడు వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో పరిస్థితి:

ఉమ్మడి జిల్లాలో ప్రతి ఏడాది కొత్తగా వేయి క్యాన్సర్ కేసులు వెలుగు చూస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రతి నెల 300, ప్రతి ఏడాది 3 వేల నుంచి 4వేల మంది క్యాన్సర్ బాధితులు ఎన్టీఆర్ వైద్యసేవ కింద ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుంటారు. ఉమ్మడి జిల్లాలో పురుషుల్లో నోటి, ఊపిరితిత్తులు, లివర్, ప్రేగు, క్యాన్సర్లు మహిళల్లో బ్రెస్ట్, గర్భాశయ ముఖద్వార, నోటి క్యాన్సర్లు అధికంగా వస్తున్నాయి. జిల్లా వైద్యఆరోగ్య శాఖ పరిధిలో ఎన్‌సీడీ 3.0 కింద సర్వేల్లో రొమ్ము క్యాన్సర్లు 17, గర్భాశయ క్యాన్సర్లు 5, నోటి క్యాన్సర్లు 11 వరకు కేసులను గుర్తించారు.

ఈ ఏడాది నినాదం

క్యాన్సర్ డే యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ (యుఐసీసీ) నిర్వహిస్తుంది. ఈ ఏడాది యునైటెడ్ బై యూనిక్ అనే నినాదాన్ని ఇచ్చింది. క్యాన్సర్ చికిత్సలో వ్యక్తులకు ప్రాధాన్యత ఉంటుంది. క్యాన్సర్‌తో పోరాడే ప్రతి వ్యక్తికి ప్రత్యేకమైన అనుభవం ఉంటుందని, అందరూ క్యాన్సర్‌ను అధిగమించేందుకు కలిసి పోరాటాన్ని కొనసాగించాలనడం ఈ ఏడాది ప్రాధాన్యత. .

క్యాన్సర్ లక్షణాలు

- జ్వరం, రక్తస్రావం
- మింగడం కష్టమవ్వడం, విపరీతమైన అలసట
- దగ్గు మానకుండా రావడం, గొంతు, బొంగురు పోవడం
- అతిగా బరువు తగ్గిపోవడం, ఆకలి తగ్గడం
- కొత్త పుట్టుమచ్చ, పుట్టుమచ్చలో మార్పు
- పుండ్లునయం కాకపోవడం
- మూత్రవిసర్జనలో నొప్పి, మూత్రంలో రక్తం కారడం

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఓ వరం



కర్నూలులో స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రి

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ రాయలసీమ ప్రాంతానికి ఓ వరం లాంటిదవి. ఈ స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ ఫిబ్రవరి నెలలో అందుబాటులోనికి తీసుకురావాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. రూ.30 కోట్లతో లీనియర్ యాక్సిలేటర్ అల్ట్రాసౌండ్, సిటీ స్కాన్ యంత్రాలు ఏర్పాటు చేశారు. రూ.19 కోట్లు విలువైన పెట్‌స్కాన్ యంత్రం రావాల్సి ఉంది.

నేడు క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



వరల్డ్ క్యాన్సర్ డేను పురస్కరించుకుని కర్నూలు ప్రభుత్వ వైద్యశాల మెడికల్ కాలేజీలో క్యాన్సర్ అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహిస్తున్నాం. అనంతరం స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశాము. 120 పడకలతో ఏర్పాటు చేస్తున్న స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో త్వరలో సేవలు అందుబాటులో వస్తాయి. ప్రస్తుతం మెడికల్, సర్జికల్, రేడియేషన్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

- డా.సీఎస్ క్రిష్ణప్రకాష్, డైరెక్టర్, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, కర్నూలు

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలి



క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుంది. విపరీతమైన అలసట, దగ్గు, ఆకలి, మూత్ర విసర్జన సమయంలో నొప్పి, శరీరంలోని ఏభాగమైనా గట్టిపడటం వంటి లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవడం అవసరం. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా వీఆర్ హాస్పిటల్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. **- డా.సి. వాసురెడ్డి, క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణుడు, వీఆర్ హాస్పిటల్, కర్నూలు**

స్మోకింగ్‌తో క్యాన్సర్



ధూమపానం, గుట్కా క్యాన్సర్ రావడానికి ప్రధాన కారణం. దాదాపు 40శాతం కేసులకు కారణం మనం పొగాకు ఉత్పత్తుల వాడకమే. పొగాకు డీఎన్‌ఏను దెబ్బతీసి, డీఎన్‌ఏ కణాలు అసాధారణంగా పెరగడానికి కారణమవుతుంది.

- డా.రవీంద్రబాబు, క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణుడు, ఒమేగా హాస్పిటల్, కర్నూలు

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మంత్రాలయం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాఘవేంద్ర పురం గ్రామానికి చెందిన చాకలి వసంత(34) అనే వ్యక్తి తన కొట్టంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వసంత కడుపు నొప్పితో బాధపడు తుండేవాడు. కర్నూలు, రాయచూరు, ఆదోని, ఎమ్మిగనూరు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినప్పటికీ నయం కాలేదు. ఇబ్బందులు తాళలేక ఆదివారం రాత్రి తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బంధువులు ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందాడు. మృతునికి భార్య హైమావతి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కట్టుకున్నోడే కాలయముడు..

- భార్యను కత్తితో పొడిచి హత్య చేసిన భర్త

తుగ్గలి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్నోడే కాలయముడయ్యాడు. భార్యను కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన మండలంలోని రాతన కొత్తూరులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తుగ్గలి మండలంలోని రాతనకొత్తూరు చెందిన కాశీం, కాశీంబీ దంపతుల కుమార్తె మహబూనిసీ(32) 15 ఏళ్ల క్రితం చెన్నంపల్లికి చెందిన మహమ్మద్, అల్లింబీ దంపతుల పెద్దకుమారుడైన అక్బర్ వలికి ఇచ్చి వివాహం చేశారు. ఆరేళ్లపాటు కలిసి ఉన్న ఆ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎనిమిదేళ్ల క్రితం భర్త వేదింపులు తాళలేక పుట్టినిల్లయిన రాతన కొత్తూరుకు వచ్చి తల్లిదండ్రుల వద్దే ఉంటూ తన ఇద్దరు కుమారులను చదివించుకుంటోంది. సోమవారం ఉదయం మహబూనిని పొలంలో పని చేస్తుండగా భర్త అక్బర్‌వలి దాడి చేసి కత్తితో పొడిచి గొంతు కోయడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న తుగ్గలి ఎస్‌ఐ కృష్ణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



అనాథలైన పిల్లలు



మహబూనీ (ఫైల్)

బైకులు ఢీ.. ఒకరి మృతి

ఆదోని, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 104 బసాపురం గ్రామంలో ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. 104 బసాపురం గ్రామానికి చెందిన మాల వీరేష్ పని నిమిత్తం ఆదివారం రాత్రి ఆదోనికి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. అదే సమయంలో ఆదోని నుంచి బసాపురానికి వస్తున్న మాదిగ వీరేష్ బైకు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మాల వీరేష్(32)కు తీవ్రగాయాలు కావడంతో ఆదోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు వెళ్లారు. కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య లతతోపాటు ఇద్దరు కుమారులు కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ పోలీసులు తెలిపారు.



వీరేష్ (ఫైల్)

కొడుకు అన్యాయం చేశాడు..

- పోలీసులను ఆశ్రయించిన వృద్ధ దంపతులు

పత్తికొండ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొడుకు తమకు అన్యాయం చేశాడని న్యాయం చేయాలంటూ వృద్ధ దంపతులు సోమవారం పత్తికొండ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన గంగిరెడ్డి, సుబ్బలక్ష్మి పట్టణంలోని నాలుగు స్థంభాల కూడలిలోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో బైఠాయించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వవరాల మేరకు.. డోన్ పట్టణానికి చెందిన వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. 1999లో అక్కడే ఇంటిని కొనుగోలుచేసి కాపురమున్నారు. పిల్లలకు వివాహం చేసి, కొడుకుతో ఇబ్బందులు రావడంతో ఇంటిని ఖాళీ చేశారు. ఫిర్యాదు చేసేందుక రాగా, పోలీసులు డోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని సూచించారు. తమకు పింఛన్ లేదని, పత్తికొండ శారదా వృద్ధాశ్రమంలో తలదాచుకుంటున్నామని ఆంధ్రజ్యోతికి తెలిపారు.



పోలీసులతో మాట్లాడుతున్న వృద్ధులు

డీఐజీని కలిసిన ఎస్పీ

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. డీఐజీ కార్యాలయంలో డీఐజీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టాల్సిన శాంతిభద్రతల చర్యలపై చర్చించారు.



డీఐజీకి మొక్క అందజేస్తున్న ఎస్పీ

ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

- ఆర్‌ఐవో గురువయ్యశెట్టి



మాట్లాడుతున్న ఆర్‌ఐవో గురువయ్యశెట్టి

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 91 ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. మొత్తం విద్యార్థులు 15194 మంది హాజరవుతున్నారని వెల్లడించారు. ఇందులో బైపీసీ విభాగం విద్యార్థులు 4679 మంది, ఎంపీసీ 10,515 మంది, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 4172 మంది విద్యార్థులు ఉన్నారని వివరించారు. ఈ పరీక్షలు 5 విడతలుగా కొనసాగుతాయన్నారు. 5 నుంచి 20వ తేదీ వరకు ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు, 10 నుంచి జనరల్ కోర్సు విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు కొనసాగుతాయని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పరీక్ష కేంద్రాల నిర్వహకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాలలో నాలుగు ల్యాబులలో ఫర్నీచర్స్, వాటికి అవసరమయ్యే మెటీరియల్స్‌ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ కమిటి సభ్యులు నాగభూషణం రెడ్డి, యు.పద్మావతి, జీఎస్ సురేష్ చంద్ర, మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రాక్టికల్స్ పరీక్షలపై ఓరియంటేషన్ ప్రోగ్రాం:

స్థానిక ప్రభుత్వ టౌన్‌మోడల్ జూనియర్ కళాశాలలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రాక్టికల్స్ పరీక్షలపై ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐవో గురువయ్యశెట్టి తెలిపారు. ఈ సమావేశానికి డీఈసీ సభ్యులు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, కళాశాల ప్రిన్సిపాల్స్, సబ్జెక్టు అధ్యాపకులు హాజరు కావాలన్నారు.

ప్రశాంతంగా పర్యావరణ విద్య పరీక్ష

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన పర్యావరణం విద్య పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో మొత్తం 162 కళాశాల్లో 23,281 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 22,764 విద్యార్థులు హాజరు కాగా, 517 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఆర్‌ఐవో గురువయ్యశెట్టి స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ సభ్యులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

పీఎంశ్రీ పాఠశాలలపై సమీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల పీఎంశ్రీ పాఠశాలల పురోగతిపై స్టేట్ సిమాట్ డైరెక్టర్ వి.మస్తానయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 52 పాఠశాలలు, నంద్యాల జిల్లాలో 40 పాఠశాలలు హెచ్‌ఎంలతో సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో మాట్లాడుతూ పీఎంశ్రీ పాఠశాలల ఫేస్-1, 2కు విడుదలైన కెమిస్ట్రీ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ, ఆట స్థలాలు, కాంపోజిట్ గ్రౌంట్ నిధులను సక్రమంగా వినియోగించు కోవాలని దుర్వినియోగం కాకుండా చూడాల న్నారు. పనులు సకాలంలో నాణ్యతతో చేయాలని సూచించారు. సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు వి.శ్రీనివాసులు, హేమంత్ కుమార్, ఎగ్జిక్యూటీవ్ ఇంసజనీర్లు పి.శ్రీనివాసులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడుమూరు పోలీస్ స్టేషన్ తనిఖీ



స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

కోడుమూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కోడుమూరు పోలీసు స్టేసన్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం రాత్రి తనిఖీ చేశారు. కేసులకు కేసుల వివరాలను సీఐ తబ్రేజ్‌ను అడిగి తెలుసుకొన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలు, నేర చరిత వ్యక్తులపై నిఘా అంశాలపై చర్చించారు. ఆయన వెంట ఎస్‌ఐ ఏపీ శ్రీనివాసులు ఉన్నారు.

మఠం భూములు మాకే చెందాలి

- రాఘవేంద్ర సర్కిల్‌లో రైతుల ధర్నా



మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్‌లో ధర్నా చేస్తున్న రైతులు

మంత్రాలయం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వంశపారంపర్యంగా తరతరాలుగా అనుభవిస్తున్న రాఘవేంద్రస్వామి మఠానికి చెందిన ఇనాం భూములు తమకే దక్కాలంటూ రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. దాదాపు 200 మంది రైతులు సోమవారం మంత్రాలయం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐకి వినతి పత్రం ఇచ్చారు. అక్కడి నుంచి వచ్చి రాఘవేంద్ర సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించారు. మంత్రాలయంలోని సర్వే నెంబర్ 157, 148/1, 200/1, 373/3, 165, 166, 288, 142, 223, 283 లలోని దాదాపు 50 ఎకరాల భూమిని నిరుపేదలైన రైతులు సాగు చేస్తూ వాటితో జీవనం సాగిస్తున్నారు. పట్టాదారుని కాలమ్‌లో రాఘవేంద్రస్వామి పేరు ఉండటం, అనుభవదారుల కింద రైతుల పేర్లు ఉన్నాయి. దీంతో రిటైర్డు ఫారెస్టు అధికారి కామటే రాఘవేంద్ర, మద్రి మాణిక్యమ్మ, వణికే కృష్ణమ్మ, సరస్వతి, జయలక్ష్మి, నాగరాజు, అంజినమ్మ, ఏబు, రాజు, ఖయూన్, తిమ్మయ్య, ప్రభుదాసుతోపాటు దాదాపు 180 మంది రైతులు పెద్ద ఆందోళన చేసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. పెద్దల నుంచి వారసత్వంగా వస్తున్న భూములను తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో తమ పేర్లు తొలగించి రాఘవేంద్రస్వామి మఠం పేరు మీదుగా ఉండేలా అధికారులు కుమ్మక్కు అవుతున్నారని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు సాగు చేస్తున్న శ్రీమఠం భూములు తమకే వర్తించేలా చూడాలని, రిజిస్ట్రేషన్‌లు జరిగేవిధంగా క్రయవిక్రయాలు చేసేలా సబ్ రిజిస్ట్రార్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మారెప్ప, రాఘవేంద్ర, రామయ్య, ఈరయ్యశెట్టి, ప్రహ్లాదశట్టి, భాగ్యమ్మ, అంపమ్మ, లక్ష్మి, హనుమంతు పాల్గొన్నారు.


గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దండి

- జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఈవో నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం స్వచ్ఛభారత్ మిషన్, జీఎస్‌డబ్ల్యూఎస్ అంశాలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, డీపీఓ భాస్కర్, డీఎల్‌డీఓ రమణారెడ్డి, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 484 గ్రామాలు ఉన్నాయని, ఇప్పటికే 63 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దామని అన్నారు. మిగిలిన గ్రామాలలో కూడా వ్యక్తిగత మరుగుదొడ్లు, బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాల నియంత్రణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 2,82,066 మంది సిటిజెన్స్ సచివాలయాల్లో నమోదు కాలేదన్నారు. అయితే వీరంతా ల్యాండ్ రికార్డ్స్, రైస్ కార్డు, ఆరోగ్య శ్రీలో వారి పేర్లు ఉండటంతో పాటు వివిధ రకాల ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతు న్నారన్నారు. తక్షణమే వీరందరిని సచివాలయాల్లో నమోదు చేయించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఈ సమావేశంలో డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ మంజుల పాల్గొన్నారు.



కావలెను

డోన్ వైష్ణవి హాస్పిటల్ నందు పనిచేయుటకు నర్సింగ్-2, రిసెప్షనిస్ట్-2, ఫార్మసీలు-2 అర్జెంటుగా కావలెను. సంప్రదించండి. సెల్ నెంబర్: **9160602359, 9000424310.**

AJL-229625

TO LET SERVICE

నంద్యాల, కర్నూలు జిల్లాల్లో ఇల్లు, అపార్ట్‌మెంట్స్, షాప్స్, ఖాళీ స్థలాలు అద్దెకు కావాలన్నా, ఇవ్వాలన్నా అందుబాటు ధరలలో చూపబడును. సంప్ర: స్టార్ TO LET సర్వీస్ : సి.పి.కాంప్లెక్స్ వెనుక, నంద్యాల. సెల్: **87908 44959.**

AJL-229052

ముస్లీం వివాహ సంబంధాలు

బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, డిఫెన్స్, డాక్టర్ సంబంధాలు కలవు. స్టార్ ముస్లీం మ్యారేజ్ బ్యూరో, నంద్యాల జిల్లా. సెల్: **87908 44959** (2వ సంబంధాలు కలవు)

AJL-229053

PASSPORT MISSING

I, **Bhuma kishore kumar,** S/o. Bhuma Nageswara rao, have lost my Indian original **passport bearing no:A7281423**, Issued at Hyderabad date:24-02-1999, has been lost by me, While applying white wash to my house, which was arranged /kept with my passport, I have lost my said passport, if found anyone please inform to this address. H.No:40/786, Flat No:201, MS9 Varma Residency, Nehru Nagar, Kurnool Dist, A.P

AJL-229577

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: **7382114647**

AJA- 226801

FOR ADVERTISEMENTS CONTACT.
Cell: 99854 11369

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



రేపు ఓంకారంలో వేలం పాటలు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓంకార క్షేత్రంలో పలు రకాల అమ్మకాలకు సంబంధించిన వేలం పాటలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఈవో నాగప్రసాద్ తెలిపారు. సోమవారం ఈవో మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి 2026 మహాశివరాత్రి పర్వదినానికి ఐదు రోజుల ముందు వరకు టెంకాయలు, కూల్‌డ్రింక్స్ అమ్మకాలకు వేలం నిర్వహిస్తామన్నారు. ఈ వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు ధరావత్తు చెల్లించి పాల్గొన్నాలన్నారు.

సనాతన ధర్మాన్ని పాటించాలి



మాట్లాడుతున్న కమలానంద భారతీ స్వామిజీ

బండి ఆత్మకూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని పాటించి ఆచరించాలని భువనేశ్వర్ పీఠాధిపతి కమలానంద భారతీ స్వామీజీ సూచించారు. సోమవారం బండి ఆత్మకూరు మండలంలోని పెద్దదేవళాపురం ఏకశిలా అభయాంజనేయస్వామి ఆలయాన్ని దర్శించి స్వామి వారికి పూజలు నిర్వహించారు. స్వామీజీకి ఆలయ నిర్వాహకులు శివరాజునాయక్, నాగేశ్వరావునాయక్, ఈశ్వర్‌నాయక్, తేజనాయక్, శివ నాయక్, నాగరాజు మేళతాళాలతో, పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామీజీ మాట్లాడుతూ దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధికి ప్రతి ఒక్క హిందువు పాటుపడాలని కోరారు. ఆలయాల నిర్మాణాలకు దాతలు సహకరించాలన్నారు.

ఆక్రమణల తొలగింపు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రం బండిఆత్మకూరు ప్రధాన దారిలో ఆక్రమణలను మండల అధికారలు తొలగింపు పనులు చేపట్టారు. సోమవారం పంచాయతీ కార్యదర్శి అక్బర్ నేతృత్వంలో రోడ్డుకు ఇరువైపులా మూడు మీటర్ల మేర ఆక్రమణలను పోలీసు బలగాల సహాయంతో తొలగించారు. ఈ రహదారిలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయి. రెండు రోజుల క్రితం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి ప్రజలు ఆక్రమణలు తొలగించాలని కోరటంతో ఈ పనులు చేపట్టినట్లు ఎంపీడీవో దస్తగిరి, ఈవోపీఆర్డీ రామకృష్ణవేణి తెలిపారు.

పట్టణ సమస్యలపై ప్రజలు ఉద్యమించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు

ఆత్మకూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో నెల కొన్న సమస్యలపై ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం నాయకులు రణధీర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆత్మకూరు పట్టణంలో అనేక సమస్యలు నెలకొన్నప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రత్యేకించి ఏకాలనీలోకి వెళ్లినా అంతర్గత రహదారులు సక్రమంగా లేవని, చిన్నపాటి వర్షాలకే రోడ్లపై నీరు నిలిచి ప్రజలకు అసౌకర్యంగా మారుతుందని అన్నారు. అలాగే పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో దోమలవ్యాప్తి అధికమై రోగాలు ప్రబలుతున్నాయని తెలిపారు. అదేవిధంగా అనేక చోట్ల తాగునీటి పైపులైన్లకు రంధ్రాలు ఏర్పడి వృథా అవుతున్నాయని చెప్పారు. అంతేకాకుండా పట్టణంలో కుక్కలు, పందుల సంచారం అధికమవ్వడంతో ప్రజలు ఇక్కట్లకు గురికావాల్సి వస్తుందన్నారు. ఆయా సమస్యలను మున్సిపల్ అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సురేంద్ర, ఇస్మాయిల్ ఉన్నారు.

శివాలయ నిర్మాణం శుభపరిణామం



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి

గోస్పాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గోస్పాడు మండలం నెహ్రూనగర్ గ్రామంలో గ్రామస్థులంతా కలిసి నూతనంగా శివాలయం నిర్మించుకోవడం శుభపరిణామమని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం గ్రామంలోని శివాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ఆరోహణ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, మండల కన్వీనర్ తులసీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మహిళకు అండగా నిలిచిన మంత్రి

గోస్పాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గోస్పాడు మండలం జూలెపల్లె గ్రామానికి చెందిన టీస్టాల్ నిర్వాహకురాలు అయినాబికి మంత్రి అండగా నిలిచాడు. 2024 ఎన్నికల ప్రచారంలో జూలెపల్లె గ్రామంలో పాల్గొన్న ఫరూక్‌కు టీస్టాల్ నిర్వాహకురాలు అయినాబీ తన ఆర్థిక ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లి సహాయం చేయాలని కోరింది. సోమవారం నెహ్రూనగర్ గ్రామానికి వెళ్తూ మార్గమధ్యంలో జూలెపల్లె వద్ద అయినాబి టీ స్టాల్ వద్ద తన వాహనాలను ఆపి ఎన్నికల ప్రచార సమయంలో ఆమెకు ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాన్ని అందిస్తామని ఆమెకు హామీ ఇచ్చారు.

సమన్వయంతో పని చేయాలి

గోస్పాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ ఆర్థర్‌సైమన్ అన్నారు. సోమవారం ఎంపీడీవో హమానుల్లా ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో కూటమి ప్రభుత్వంలో 3.5 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్‌లు నిర్మించినట్లు పీఆర్ ఏఈ పుల్లయ్య తెలిపారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. అధికారులు రాజకీయాలకు అతీతంగా పనులు చేయాలని ఎంపీపీ అన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మోహిద్దీన్, ఈవోఆర్డీ నాగఅనసూయ, ఎంపీటీసీ జగదీశ్వరమ్మ, ఉపాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

శాశ్వత అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం(ఆత్మకూరు), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రంలోని వికారాబాద్‌కు చెందిన చెందిన సీ.చైతన్య అనే భక్తుడు శనివారం రూ.1,00,116 విరాళం అందజేశారు. సంబంధిత విరాళ సొమ్మును దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి స్వాములుకు అందజేశారు.

పక్కా గృహాలు మంజూరు చేయాలి

నందికొట్కూరు రూరల్ జనవరి3(ఆంధ్రజ్యోతి) : నందికొట్కూరు పట్టణం, గ్రామీణ ప్రాంతంలో ఇళ్ల లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా గృహాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కార్యదర్శివర్గ సభ్యుడు రఘురాంమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులుకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు, నిరుపేదలతో కలిసి వినతి పత్రాలు అందజేశారు. సోమవారం నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రజితమ్మ, మజీద్, ప్రసాద్,ఏఐఎస్ఎఫ్ నాయకులు మహానంది, వినోద్, దినేష్ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న పురోహితుడు

కొలనుభారతికి పోటెత్తిన భక్తులు

జిల్లాలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొలనుభారతి క్షేత్రానికి రెండో రోజు సోమవారం కూడా భక్తులు పోటెత్తారు. ఈ ఏడాది పంచమి 2, 3 తేదీల్లో రావడంతో ఆది, సోమవారాల్లో అమ్మవారి జన్మనక్షత్రం పురస్కరించుకుని వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కొత్తపల్లి ఎస్ఐ కేశవ తమ సిబ్బందితో కలిసి శివపురం గూడెం వద్దే భక్తుల వాహనాలు నిలిపివేసి అక్కడి నుంచి విడతల వారిగా వాహనాలు క్షేత్రానికి పంపించారు. ఆది, సోమవారాల్లో రెండు రోజులు సుమారు 20వేల మంది పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు అంచనా వేశారు. కొలనుభారతి వసంతపంచమి వేడుకలకు హాజరైన భక్తుల ద్వారా రూ.2,58,330 ఆదాయం లభించినట్లు ఈవో రామలింగారెడ్డి తెలిపారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమ కమిటి ఆర్యవైశ్య సత్ర నిర్వహకులు శివపురం గ్రామ సమీపంలోని కాలభైరవ అన్నదాన ఆశ్రమ ట్రస్టు నిర్వాహకులు విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

నంద్యాలలో వసంత పంచమి

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని సంజీవనగర్ కోదండరామాలయం, గాయత్రీ దేవాలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో వసంత పంచమి వేడుకలను నిర్వహించారు. భగవత్‌సేవాసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో రామాలయంలో 108కలశాలతో సరస్వతీమాతకు అష్టోత్తర శత కలశక్షీరాభిషేకం చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. గాయత్రీమాత ఆలయంలో బ్రాహ్మణసేవాసమాఖ్య నిర్వాహకులు మురళీక్రిష్ణ ఆధ్వర్యంలో సర్వస్వతీ హోమం, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం, విద్యార్థులకు టీడీటీ కంకణాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భగ వత్ సేవాసమాజ్ కమిటీ అధ్యక్షులు సముద్రాల సూరయ్య, సభ్యులు దేవరశెట్టి శ్రీనివాస్, పార్థసారథిక్రిష్ణ, వంకదారి మధు, భక్తులు పాల్గొన్నారు.



నంద్యాలలో అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

పాణ్యం: మండలంలో వసంత పంచమి సోమవారం ఘనంగా నిర్వహించారు. కొండజూటూరు మండల పరిషత్ పాఠశాల (స్పెషల్)లో దాతల సహకారంతో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఒకటవ తరగతిలో చేరే పిల్లలకు తల్లి దండ్రుల సమక్షంలో సరస్వతీ పూజలు చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుదర్శన్, అంగన్‌వాడి కార్యకర్త శ్యామల, దాతలు పాల్గొన్నారు.

మహానంది : మహానంది మండలంలో సోమవారం ఘనంగా వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో సరస్వతీదేవికి పూజలు చేశారు. గోపవరం జడ్పీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిరాలు జ్యోతి గ్రామంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు 40 పలకలు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, ఉపాధ్యాయిలు పాల్గొన్నారు.

నంద్యాల విద్య: నంద్యాల పట్టణంలోని పలు కళాశాలలో వసంతపంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో డైరక్టర్‌లు షేక్షావలి, మౌళాలిరెడ్డిల ఆధ్వర్యంలో 100మంది విద్యార్థులతో అక్షరభ్యాసం పాఠ శాల కరస్పాండెంట్ దస్తగిరిరెడ్డి విద్యాభ్యాసం చేయించారు. న్యూక్లియస్ జూనియర్ కళాశాలలో సరస్వతీదేవి చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు.

భక్తులకు సకల సదుపాయాలు కల్పించాలి

మహా శివరాత్రి ఉత్సవాల ప్రత్యేక అధికారి చంద్రశేఖర ఆజాద్

శ్రీశైలం(ఆత్మకూరు), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు దేవస్థానం తరుపున సకల సదుపాయాలు కల్పించాలని ఉత్సవాల ప్రత్యేక అధికారి చంద్రశేఖర ఆజాద్ పేర్కొన్నారు. సోమవారం దేవస్థానం సమావేశం మందిరంలో ఉత్సవాల నిర్వహణపై ఉభయ ఆలయాల ప్రధానార్చకులు, ఆయా విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణలో ఆయా కైంకర్యాల నిర్వహణలో సమయ పాలన పాటించాలన్నారు. భక్తుల రద్దీకి తగ్గట్లుగా ఏర్పాట్లను సిద్ధం చేయాలని చెప్పారు. ప్రత్యేకించి కాలినడకన వచ్చే భక్తులకు తాగునీటి సరఫరా కల్పించాలన్నారు. అలాగే పాదయాత్రిలకు హఠకేశ్వరం వద్ద జల్లుస్నానానికి ఏర్పాట్లు చేయాలన్నారు. కాగా బ్రహ్మోత్సవాలకు ముందే పాదయాత్రికులు తరలి వచ్చే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో ముందు నుంచే కైలాసద్వారం వద్ద దేవస్థానం ద్వారా అన్నప్రసాద వితరణ చేపట్టాలన్నారు. స్నానఘట్టాల ఎగువ ప్రదేశంలో కూడా జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. దర్శనానికి సంబంధించి క్యూలైన్లలో భక్తులు అధిక సమయం వేచి ఉండకుండా దృష్టి సారించాలన్నారు. క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉండే భక్తులకు తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లను అందించాలని సూచించారు. క్షేత్ర పరిధిలో అవసరమైన చోట్ల సమాచార బోర్డులు, సూచిక బోర్డులను ఉంచాలన్నారు. దేవస్థానం గదులు, కాటేజీలు, డార్మిటరీల్లో సదుపాయాలు సజావుగా ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేవస్థానం పరిధిలో ఆయా విభాగాలు అధికారులు, సిబ్బందితో సమన్వయంతో విధులు చేపట్టాలన్నారు. లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలు, దర్శన క్యూలైన్లు, క్యూకాంప్లెక్స్‌ను పరిశీలించారు.



మాట్లాడుతున్న ఉత్సవాల ప్రత్యేక అధికారి చంద్రశేఖర ఆజాద్

విద్యార్థులకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణాసంస్థ కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులకు ఫోర్ వీలర్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కె.పుష్పక్ సోమవారం తెలిపారు. శిక్షణ ఈ నెల 24నుంచి ప్రారంభించి 30రోజులపాటు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు 18సంవత్సరాలనుంచి 45 సంవత్సరాల్లోపు ఉండి, చదవడం, రాయడం వచ్చి ఉండాలని, శిక్షణా కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆరు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా, విద్యార్హత సర్టిఫికెట్లతోపాటు ఫోర్ వీలర్ ఎల్ఎల్ఆర్ జిరాక్స్ కాపీలతో కర్నూలు బి.తాండ్రపాడు కెనరాబ్యాంక్-గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణాసంస్థ డీఆర్‌డీఏ-టీటీడీసీ పక్కన సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 6304491236, 8500677585, 9440905477 నెంబర్లను సంప్రదించాలని డైరెక్టర్ పుష్పక్ పేర్కొన్నారు.

వైభవంగా వెండి రథోత్సవం

శ్రీశైలం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు సోమవారం రాత్రి వెండి రథోత్సవ సేవ సంప్రదాయబద్ధంగా చేపట్టారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను రథంలో ఊరేగించారు. అదేవిధంగా సహస్ర దీపార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా దక్షిణ మాడవీధిలోని నిత్యాకళారాధన వేదికపై సోమవారం శ్రీనవ్యలాస్య కళానిలయం హైదరాబాద్‌కు చెందిన వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మహాగణపతిం, శివాష్టకం, మూషికవాహన, నమశ్శివాయతే, శివతాండవం, భో.. శంభో, అయిగిరినందిని తదితర అష్టకాలకు, గీతాలకు ఆధ్య, దక్షిత, జాగృతి, దివ్య, దక్షిత తదితరులు నృత్యప్రదర్శనలు చేశారు.

అటవీ అధికారుల అడ్డంగులను తొలగించండి

ఆత్మకూరు, ఫిబ్రవరి 3: శ్రీశైలానికి కాలినడక మార్గంలో చిరుదుకాణాలను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్న చెంచు గిరిజనులపై అటవీ అధికారులు కల్పిస్తున్న అడ్డంకులను తొలగించాలని ఆత్మకూరు మండలంలోని బైర్లూటి, నాగలూటి చెంచు గిరిజనులు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని కోరారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బుడ్డాను కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. ప్రతిఏటా శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రి, ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని కాలినడక మార్గంలో టెంకాయలు, తిరుబండాలు, కూల్ డ్రింగ్స్ తదితర విక్రయాలు సాగిస్తూ ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. అయితే ఈ ఏడాది దుకాణాలు ఏర్పాటు చేయవద్దని అటవీ అధికారులు ఆంక్షలు విధిస్తున్నారని వాపోయారు. అయితే ఈ ఏడాది అటవీశాఖ నిబంధనలతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే అటవీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే బుడ్డాతో మాట్లాడుతున్న నల్లమల చెంచులు

కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటం

నందికొట్కూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులపై పోరాటం చేయాలని సీపీఐ(ఎం.ఎల్) లిబరేషన్ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు, ఐసా జిల్లా కార్యదర్శి స్వామిదాసు, నాగార్జున డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సీపీఐ(ఎం.ఎల్) లిబరేషన్ కార్యాలయంలో ఏఐసీసీటీయూ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ 11వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. గత 11 ఏళ్లుగా మోడీ పాలనలో కార్మికవర్గంపై దోపిడీ, అణచివేత తారాస్థాయికి చేరుకుందన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 24 నుంచి 26 వరకు ఢిల్లీలో ఏఐసీసీటీయూ 11వ జాతీయ మహాసభలను నిర్వహిస్తోందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, భాస్కర్ గౌడ్, షేక్షావలి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో విజ్ఞానం పెంచాలి

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉపాధ్యాయులు విజ్ఞానం పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయక్ తెలిపారు. సోమవారం నంద్యాల ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులలో పరీక్షల భయాన్ని పోగొట్టి, సులభంగా ఉత్తీర్ణతలను సాధించేందుకోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 7న మధ్యాహ్నం గంటల 3 నుంచి సాయంకాలం 4:30 వరకు ప్రజ్ఞావికాసం మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో భయాన్ని, వత్తిడిని పోగొట్టేందుకు ఎస్ఎఫ్ఐ కృషి చేస్తుందన్నారు.

27 నుంచి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

మహానంది, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మహానంది మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచే రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు ఈనెల 27 నుంచి నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ రైతు కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం మహానంది సమీపంలోని రాష్ట్ర స్థాయి ఎద్దుల బల ప్రదర్శన క్రీడా మైదానంలో పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. విజేతలైన ఎద్దుల యజమానుల కు రూ.7.90 లక్షల బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి, మధు, మారెడ్డి సుబ్రహ్మణ్యం, మల్లికార్జునరావు, కిలార్ వెంకటేశ్వర్లు, క్రాంతికుమార్, మహేశ్వరరెడ్డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విధుల్లో లేని సిబ్బందికి షోకాజ్ నోటీసులు

నందికొట్కూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విధుల సమయంలో కార్యాలయంలో లేనటువంటి ఇద్దరు సిబ్బందికి నంద్యాల జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ప్రేమంత కుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సోమవారం పట్టణంలోని భవితా సెంటర్, పలు పాఠశాలలను, భవితా సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. విధుల సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా బయటకు వెళ్లి ఐఈఆర్‌టీ విజయకుమారి, రవిబాబులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు ఎంఈవో సుభాన్, నంద్యాల జిల్లా అకడమిక్ మానిటర్ ఆఫీసర్ లలిత కుమారి, ఉర్దూ పాఠశాలల అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యదాయకం

గడివేముల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వార పండించిన ఉత్పత్తులు ఆరోగ్యదాయకమని ఎంపీడీవో వాసుదేవ గుప్త అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు. రైతు సాధికార సంస్థ సిబ్బందితో పెట్టుబడిలేని వ్యవసాయం గురించి అడిగి తెలుసుకున్నారు. యూనిట్ ఇన్‌చార్జి ప్రభావతి మాట్లాడుతూ మార్కెట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని అన్నారు. ప్రకృతి సేద్యంతో పండించిన పంటలు విష తుల్యం కావని అన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

పగిడ్యాల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : రథసప్తమిని పురస్కరించుకొని పాత ముచ్చుమర్రి, వనములపాడు గ్రామాల్లో సోమవారం సాయత్రం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని చేపట్టారు. త్రైతసిద్ధాంత ప్రచార సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఇంటింటికి వెళ్లి భగవద్గీత గ్రంధాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇందూజ్ఞాన వేదిక కమిటి అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, నాగమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

హైవే అండర్ బ్రిడ్జి ఎత్తు పెంచాలి

పాములపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పాములపాడు, చెలిమిల్ల గ్రామాల మధ్య జరుగుతున్న నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా చేపడుతున్న అండర్ బ్రిడ్జి నిర్మాణం ఎత్తు పెంచాలని ప్రజలు, టీడీపీ నాయకులు లోకేశ్ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేకర్‌రెడ్డిని కోరారు. సోమవారం బైరెడ్డిని కలిసి సమస్యను వివరించారు. నేషనల్ హైవే అండర్ బ్రిడ్జి కింద దాదాపు 26 గ్రామాల ప్రజలు పలు రవాణాలతో పాటు ప్రయాణాలు చేయాల్సి ఉంటుందని, మరో ఐదు అడుగుల మేర ఎత్తు పెంచాలని కోరారు. ఈ విషయంపై ఎంపీ శబరి దృష్టికి తీసుకెళ్లి హైవే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుజ్జన్న, తదితరులు ఉన్నారు.

ట్రేడ్ లైసెన్స్ పేరుతో ఫేక్ కాల్

నంద్యాల మునిసిపాలిటీ ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని వ్యాపారులకు ఇటీవల ట్రేడ్ లైసెన్స్ పేరుతో ఫేక్ కాల్స్ వస్తున్నాయని, వాటికి స్పందించవద్దని వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్ సూచించారు. సోమవారం కమిషనర్ మాట్లాడుతూ 6300805117 నెంబర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు వ్యాపారులకు ఫోన్ చేసి సదరు నెంబర్‌కు ట్రేడ్ లైసెన్స్ ఫీజు ఫోన్‌పేలో చెల్లించాలని అడుగుతున్నారని, ఆ నెంబర్‌పై ఫోన్ కాల్స్ వస్తే స్పందించవద్దని సూచించారు. ట్రేడ్ లైసెన్స్‌ను ఫోన్ పే చేయమని ఎవరు ఫోన్ చేసినా వెంటనే 9849907458, 9849908002, 7702776049, 984996654లకు ఫిర్యాదు చేయాలన్నారు.

భావి తరాలు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భావి తరాల బాగు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్‌నాయక్ అన్నారు. నంద్యాల మండలం అబాండ తండాలో ఉన్న అంగనవాడీ కేంద్రంలోని విద్యార్థులకు సోమవారం డుమావత్ స్వామినాయక్ ఆధ్వర్యంలో ప్లేట్లు అందజేయడంతో పాటు గర్భిణులకు శ్రీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో కార్తీక్‌నాయక్, లోకేష్‌నాయక్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వలసల నివారణకే వైసీపీ పోరుబాట డ్రామా

తెలుగుగంగ వల్లే ఫ్యాక్షన్ తగ్గు ముఖం: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

నంద్యాల మున్సిపాలిటీ ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ నుంచి వలసలు ఆపటానికే వైసీపీ పోరుబాట డ్రామాకు తెరలేపిందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ఎద్దేవా చేశారు. నంద్యాలలో తెలుగు గంగ ఆయకట్టు చైర్మన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలోని చాబోలు పరిసరాల్లో తమ రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం అక్రమాలకు పాల్పడిన శిల్పాతో పాటు సహకరించిన అధికారులనూ వదలమని హెచ్చరించారు. తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం శిల్పా పొలాలకు నీరు పారే కెసీ కెనాల్‌ను సైతం ఆక్రమించారని ఆరోపించారు. తెలుగు గంగ ప్రాజెక్ట్ వల్లే ఆళ్లగడ్డ ప్రాంతంలో ఫ్యాక్షన్ తగ్గి రైతులు ఆనందంగా ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడినా ఆ పార్టీ నాయకులు కనీసం రైతులను పట్టించుకోలేదని విమర్శించారు.

సమన్వయంతో ఆయకట్టు అభివృద్ధి: చైర్మన్ సంజీవ కుమార్ రెడ్డి

లెలుగు గంగ సిబ్బంది, రైతుల సమన్వయంతో చివరి ఆయకట్టుకూ నీరు పారేలా కృషి చేస్తానని తెలుగు గంగ సాగు సంఘం చైర్మన్ సంజీవ కుమార్ రెడ్డి తెలిపారు. అక్కడక్కడ దెబ్బ తిన్న తెలుగు గంగ కాలువల మరమ్మతుతో పాటు ప్రాజెక్టు అభివృద్ధికి అవసరమైన నిధుల ప్రతిపాదన చేస్తామని హామీ ఇచ్చారు. ఆయకట్టు విస్తీర్ణం పెరిగేలా కృషి చేస్తానని తెలిపారు. తెలుగు గంగ కార్యాలయ మరమ్మత్తులు కోసం ప్రయత్నిస్తానన్నారు. కార్యక్రమంలో, టీడీపి శిరివెళ్ల మండల కన్వీనర్ శ్రీకాంత రెడ్డి మాజీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్ తో పాటు, మాజీ కౌన్సిలర్ ఇమ్మానియేల్ అయ్యాలూరు మహిళా టీడీపి నాయకురాలు శంకరమ్మ గంగవరం సాగు నీటి సంఘం అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, నాయకులు రామ, ఈశ్వరయ్య తదీతరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

● డోన్ సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి



విద్యార్థికి బహుమతులు అందజేస్తున్న న్యాయాధికారి

డోన్ టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలని డోన్ సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి, ఆర్టీవో క్రాంతి కుమార్ సూచించారు. సోమవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచి రహదారి భద్రత, చట్టాలపై అవగాహన కలిగి ఉండా లన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షైమున్నీసా, ఉపాధ్యాయులు ఖాశీంబీ, రాజేశ్వరి, వరలక్ష్మి, విజయలక్ష్మి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న జిల్లా అలెస్కో అధికారి రఘురామిరెడ్డి

చాగలమర్రి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'పది' విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వంద రోజుల ప్రణాళికను హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అలెస్కో అధికారి రఘురామిరెడ్డి తెలిపారు. సోమవారం చాగలమర్రి గ్రామంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలను, భవితా కేంద్రాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పది'లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి డ్రాపౌట్స్ లేకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో అలెస్కో సహాయ అధికారి శ్రీనివాసులు, ఎంఈవో అనూరాధ, ఇన్‌చార్జి హెచ్ఎంలు శ్రీనివాసులు, రామలక్ష్మమ్మ, సీఆర్పీ అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠకు రండి



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో నిర్మించిన షిరిడీ సాయిబాబా ఆలయ ప్రతిష్ఠ ఈ నెల 9 నుంచి 13వరకు నిర్వహిస్తున్నామని భక్తులు తరలిరావాలని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని కొత్తబస్టాండు నుంచి పాతబస్టాండు మీదుగా గుత్తి రోడ్డు వరకు ప్రధాన కూడలి ప్రాంతాల్లో ఉన్న వ్యాపారస్తులు, పలువురు ప్రముఖులకు సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, సాయిబాబా సేవా సమితి సభ్యులు కందుకూరి పార్థసారథి, కొండ సురేష్, ఆలా మల్లికార్జున, శ్రీరాములు, టీడీపీ యువ నాయకులు ధర్మవరం గౌతమ్‌రెడ్డి, వైహనుమంత రెడ్డి, కోనేటి కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

7లోగా దరఖాస్తు చేసుకోవాలి

రుద్రవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ రుణాలకు ఈనెల 7లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మండలానికి 58 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. సబ్సిడీ పొందవచ్చన్నారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని దరఖాస్తును ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు.

మార్చి చివరి వరకు సాగునీరు

చాగలమర్రి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజోలి ఆనకట్ట నుంచి కేసీ కాలువకు మార్చి చివరి వరకు సాగునీరు అందిస్తామని కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. సోమవారం రాజోలి ఆనకట్ట వద్ద ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన వెం ట సూపర్ వైజర్ దస్తగిరి, లస్కర్లు ఉన్నారు.

'ఎస్సీ కాలనీ అభివృద్ధికి సహకరించండి'

డోన్ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలోని ఎస్సీ కాలనీ అభివృద్ధికి రెవెన్యూ అధికారులు సహకరించాలని టీడీపీ నాయకులు ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం డోన్‌లో తహసీల్దార్ నాగమణిని కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, ధర్మవరం గ్రామ ప్రజలు శేఖర్, రాముడు, రంగడు, నాగయ్య పాల్గొన్నారు.

బియ్యంలో తరుగు

డోన్ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం సమీపంలోని ప్రభుత్వ సివిల్ సప్లయ్ గోడౌన్ నుంచి సరఫరా అయ్యే బియ్యంలో తరుగు వస్తుందని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవార డోన్ ఆర్డీవో నరసింహులును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ భాస్కర్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, బీఎస్ఎఫ్ జిల్లా నాయకుడు సురేష్ పాల్గొన్నారు. అలాగే సర్వజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాశిపోగుల శివశంకర్ డోన్ ప్రభుత్వ సివిల్ సప్లయ్‌గోడౌన్‌లో జరు గుతున్న అవకతవకలపై విచారణ జరిపించాలని ఆర్డీవో నరసింహులును కోరుతూ వినతి పత్రం అందజేశారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram finance ltd Proddatur branch issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Ediga Venkata Subbaiah s/o Ediga Moulali** residing at D.no:-4-44, Kummari Street, Sanjamala Mandal, Nossam, Nandyal Dist by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments, court disputes etc, shall be informed to the address mentioned below in within 5 days from the date of this notice, otherwise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTIES:** Kurnool dis: Kolakuntla Registration sub district, Sanjamala Mandal, Nossam Grama Panchayath and Village Field Residential Building Situated At Sy. No : 452, D-No.4/44 Kummari Street An Extent of 2.58 Cents or 125.0 Sq Yards with in the following **Boundaries** : EAST : PROPERTY OF EDIGA VENKATA RAMANAIAH, WEST : ROAD, NORTH : SITE OF APPLICANT, SOUTH : HOUSE OF EDIGA MOULALI.

G. PARAMESWARA KUMAR
ADVOCATE, PRODDATUR

ఆర్థికంగా ఎదగాలి

బనగానపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధులను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని వెలుగు ఏపీఎం శ్రీనివాసులు కోరారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రూపు సభ్యులకు రూ.60లక్షలకు రుణాలు మంజూరు అయ్యాయని ఇచ్చిన రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుంతలమయం

- ఏళ్లగా మరమ్మతులకు నోచుకోని గ్రామీణ రోడ్లు
- రహదారులకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు

రుద్రవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ఎప్పుడో వేసిన రోడ్లు కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. గుంతులు పడి ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే దిక్కులేదు. మూరుమాల గ్రామాల రోడ్లను అడిగేవారే



బి. నాగిరెడ్డిపల్లె, పేరూరు గ్రామాల మధ్య కంపచెట్లతో రహదారి ఇలా..



గుంతలమయమైన చిన్నకంబలూరు మెట్ట నుంచి శిరివెళ్ల వైపు రహదారి

లేరు. చిన్నకంబలూరు మెట్ట నుంచి శిరవెళ్లకు వెళ్లే ఆర్అండ్‌బి రహదారి రెండున్నర కిలోమీటరు గుంతలమయంగా మారింది. ఈ రహదారి వెంట వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అలాగే బి.నాగిరెడ్డిపల్లె, పేరూరు గ్రామాల మధ్య రహదారి గుంతలమయమై ఇరువైపుల కంపచెట్లు పెరిగాయి. కంకర తేలడంతో రాకపోకలకు అవస్థ తప్పడం లేదు. పేరూరు గ్రామ సచివాలయానికి కొండమాయపల్లె, కొత్తూరు, వెలగలపల్లె. బి.నాగిరెడ్డిపల్లె గ్రామాల ప్రజలు వెళ్లాల్సి ఉన్నది. గుంతల రహదారితో ప్రయాణించలేక నడుములు పట్టుకుంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు రహదారుల నిర్మాణాలను చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా యాగంటి పల్లకీ సేవ మహోత్సవం

బనగానపల్లె, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ప్రముఖయ శైవక్షేత్రమైన యాగంటి ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీసేవ ఉత్సవం సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఆలయ ఈవో చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకిసేవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

పార్వేట పల్లకికి విశేష పూజలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డకు చేరుకున్న అహోబిలం లక్ష్మీనృసింహస్వామి పార్వేట పల్లకికి ప్రజలు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. జ్వాలా, ప్రహ్లాదవరదస్వామి కొలువైన ఉత్సవ పల్లకిని పట్టణంలోని పలు కాలనీల్లో ముస్తాబైన తెలుపులపై కొలువుంచి సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. పార్వేట పల్లకి రాకతో పట్టణంలో పండగ వాతావరణం నెలకొంది. బొమ్మలు, గాజుల దుకాణాలు, తినుబండారాల అంగళ్లను ఏర్పాటు చేయడంతో మహిళలు, చిన్నారులు సందడిగా గడుపుతున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సూచించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆరోగ్యశ్రీ నంద్యాల జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రూపేంద్రనాథ్‌రెడ్డి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆరోగ్యశ్రీ సేవలను మరింత విస్తృతం చేయాలని.. ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

దొర్నిపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ సుభద్ర అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ మాదవ్, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

రుద్రవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వైన్‌షాపుల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ సీఐ విజయకుమార్ అన్నారు. సోమవారం రుద్రవరం శివాలయం సమీపంలో అవగాహన కల్పించారు. ఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం సభ్యులకు ఆహ్వానం

- కల్యాణోత్సవంలో ఉభయదారులుగా నియామకం



ఆహ్వానపత్రిక అందుకుంటున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : అహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాల్లో జరిగే స్వామివారి కల్యాణోత్సవంలో పద్మశాలి సంఘం సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించేందుకు మఠం నిర్వాహకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. పద్మశాలి సంఘంలో ఎన్నుకున్న సంఘ సభ్యులైన ఇద్దరు దంపతులు మార్చి 11, 12 తేదీల్లో స్వామివారి కల్యాణోత్సవంలో ఉభయదారులుగా వ్యవహరించాలని పీఠాధిపతి వేణుగోపాలాచార్యులు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, పద్మశాలీయ సంఘం ప్రతినిధులు పబ్బు తులసి కృష్ణ, రామయ్య, మద్దిలేటి, బాలాజీ, పెద్ద సుబ్బరాయుడు, నరసయ్య, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రమైన కొలిమిగుండ్లలోని శివాలయంలో మంగళవారం శాంతిరాం ఆసుపత్రి ఆధ్వర్యం లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుగు యువత అధికార ప్రతినిధి మందా విజయ్ సోమవారం తెలిపారు. మంత్రి బీసీ జనార్ధనరెడ్డి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగానే ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లబ్ధిదారులను పరిశీలించిన వైద్య బృందం

శిరివెళ్ల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : బోగస్ పింఛన్ల ఏరివేతలో భాగంగా గ్రామాల్లో వైద్య బృందం సోమవారం పర్యటించింది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ ప్రభుత్వం నుంచి రూ.15 వేలు పింఛను తీసుకుంటున్న లబ్ధిదారులను వైద్య బృందం పరిశీలించింది. మండలంలోని గుంప్రమాన్‌దిన్నె, యర్రగుంట్ల, శిరివెళ్ల, కోటపాడు గ్రామాల్లో పింఛన్‌దారులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

62 రకాల వైద్య పరీక్షలు

- పీహెచ్‌సీ వైద్యుడు హరిచరణ్ రెడ్డి



కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల ప్రభుత్వ వైద్యశాల ల్యాబ్‌లో ఆధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయని వైద్యుడు హరిచరణ్ రెడ్డి అన్నారు. 62 రకాల పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' మాట్లాడారు.

ప్రశ్న: ఆసుపత్రిలో మందుల కొరత ఉందా ..?

జవాబు: ఆసుపత్రిలో మందుల కొరత లేదు. అన్ని జనరల్ రెగ్యులర్ మందులతో పాటు, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయి. సిబ్బంది కూడా పూర్తి స్థాయిలో ఉన్నారు.

ప్రశ్న: క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే ఎలా సాగుతోంది..?

జవాబు: మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బంది క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. మండలంలో 40శాతం కుటుంబాలను కలిసి, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేశాం. ఇంత వరకు ఎటువంటి అనుమానిత కేసులు నమోదు కాలేదు.

ప్రశ్న: కుష్ఠువ్యాధి సర్వే ఎలా కొనసాగుతోంది..?

జవాబు: మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బంది కుష్ఠు వ్యాధి సర్వే చేస్తున్నారు. సర్వే రెండు, మూడు రోజుల్లో పూర్తవుతుంది.

ప్రశ్న: ఆసుపత్రిలో ప్రసవాలు జరుగుతున్నాయా ..?

జవాబు: కొలిమిగుండ్ల ప్రభుత్వాసుపత్రిలో ప్రతి నెలా 5నుంచి 6 కాన్పులు చేస్తున్నాం. వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. గర్భిణులు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి. ఆసుపత్రిలో కాన్పు చేసుకుంటే ఎన్టీఆర్ భరోసా కింద రూ.నాలుగు వేలు అందిస్తున్నాం. త్వరలో బేబి కిట్లు కూడా అందుబాటులోకి రానున్నాయి.

7న చలో హైదరాబాద్



చాగలమర్రిలో ఎస్సీవర్గీకరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్యాపిలి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాప కులు మంద క్రిష్ణ మాదిగా ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు- వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు సుందరం, నాగ రాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎస్సీ కాంప్లెక్స్ ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, అనూక్, రాజేష్ పాల్గొన్నారు.

చాగలమర్రి: ఎస్సీ వర్గీకరణ అమలుకు లక్ష డప్పులతో చేస్తున్న ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, మండల కన్వీనర్ సంజీవరాయుడు కోరారు. సోమవారం చాగలమర్రి ఎస్సీ కాలనీలో చలో హైదరాబాదు పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలి

బనగానపల్లె, ఫిబ్రవరి 3 ఆంధ్రజ్యోతి): పేదలకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకుడు సుబ్బారెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి ఇంటి పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. శివనాగయ్య, సుదర్శన్‌యాదవ్, సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ఘనంగా వసంత పంచమి

- పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

చాగలమర్రి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని మల్లేవేముల రహదారి లోగల ప్రాథమిక పాఠశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస



అక్షర పాఠశాలలో ముస్లిం మహిళ తన కూతురికి అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుడు ప్రతాప్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం, పూర్ణాహుతి కార్యక్ర మం నిర్వహించారు. ఎంఈవో అనూరాధ ఆధ్వర్యంలో చిన్నారులకు సామూ హిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సురేంద్రనాథ్‌రెడ్డి, మౌనిక దంపతులు, ఫర్థికారెడ్డి, శివారెడ్డి, ధరణిదేవి, గగన్‌రెడ్డి, సహెర సం ఘ సభ్యులు అబ్దుల్లా, ఉసేన్‌బిలాల్, విశ్రాంత హెచ్ఎం మధుసూదన్, సీఆర్పీ అమీర్‌ఖాన్, ఆర్య వైశ్యులు చెంచు సుబ్బారావు, ప్రభాక ర్, రాజేష్, హెచ్ ఎం ప్రసాద్, కాంతా రావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్యాపిలి: సరస్వతీ శిశు మందిరంలో సోమవారం వసంత పం చమి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం చిన్నారులకు అక్షరా భ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్ర మంలో పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: పట్టణంలోని అక్షర స్కూల్‌లో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ రామకృష్ణ, పాఠశాల డైరెక్టర్ రఘురాం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కాగా, ఓ ముస్లిం మహిళ పూజల్లో పాల్గొని తన కూతురుకు అక్షరాభ్యా సం చేయించి మతసామరస్యాన్ని చాటారు. కార్యక్ర మంలో ఉపా ధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే పట్టణం లోని సాయి విజేత ఇంగ్లీషు మీడియం పాఠశాలలో వసంత పంచమి వేడుకలు కరస్పాండెంట్ సుబ్బు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. అన్ని దానాల్లోకెల్లా విద్యాదానం గొప్పదని కరస్పాండెంట్ సుబ్బు యాదవ్ అన్నారు.

● ప్రభుత్వ పాఠశాలలో..

పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా



చాగలమర్రి ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో అనూరాధ

సరస్వతి అమ్మవారికి చిత్రపటానికి పుష్పమాలలు వేసి సరస్వతి శ్లోకాలను విద్యార్థులు చదివి వినిపించారు. కార్యక్రమంలో పాఠ శాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అయా పాఠశాలల్లో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం మాయలూరు గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అమ్మవారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమ ర్పించారు. కొండుపల్లె, బోడెమ్మ నూరు, ఉయ్యాలవాడ గ్రామ ఆదర్శ పాఠశాలల్లో అమ్మవారి విగ్రహాలకు పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షరీఫ్, ఉపాధ్యాయులు దేవేంద్ర, రమణ. ఓబులేసు తదితరులున్నారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల) : వసంత పంచమి వేడుకలను ఆళ్లగడ్డలోని ఇండియన్ గ్లోబల్ హైస్కూల్‌లో సోమ వారం ఘనంగా నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్ బాషా, పాఠశాల కరస్పాండెం ట్ దస్తగిరి బాషా ఆధ్వర్యంలో చిన్నారుల కు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అర్చకులచే శాస్త్రోక్తంగా సరస్వతీ పూజ ఏర్పాటు చేసి తల్లిదండ్రుల సమక్షంలో అక్షరాభ్యాసం చేపట్టారు.



ప్యాపిలిలో చిన్నారులచే అక్షరాభ్యాసాన్ని చేయిస్తున్న తల్లులు



ఆళ్లగడ్డలో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



మాయలూరులో సరస్వతీదేవికి పూజ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు